# దైనందినం

యం. జానకీరాణి

ప్రొద్దున్న తొమ్మిదింబావు—

హిమాయత్ నగరులో మసీదు కెదురుగా సందు. ఆ సందులోంచి వస్తారు ఒక యువతి, ఒక యువకుడు. ఆ అమ్మాయి సన్నగా, పొడుగ్గా వుటుంన్న నొక్కుల జుట్టుని ఫేషనబుల్‌గా చుట్ట చుడుతుంది. సన్నజాజిపూలు తెల్లగా, వంపుగా వుంటాయి ఆ చుట్టమీద. చాలా నాజూకైన చీరెలు కట్టుకుంటుంది. కళ్ళకి చలవజోడు, చేతిలో ఒక అందమైన అల్లికసంచీ. ఇంక ఆ అబ్బాయి—చామనచాయ, కనుముక్కు తీరు బాగుంటుంది. అతను గాగుల్స్ పెట్టుకుంటాడు. అతని చేతిలో న్యూస్ పేపరు, ఒకటి రెండు పుస్తకాలు.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ, లోకంతో సంబంధం లేనట్లుగా దేనివంకా చూడకుండా నడుస్తారు. రోడ్డు పొడుగునా వుండే ఇళ్ళన్నింటి వంకా నిర్లిప్తంగా చూస్తుంది ఆ అమ్మాయి. కానీ ఆ చూపులో భావమేమిటో ఎవరికీ అర్థమయ్యే అవకాశం లేదు. నల్ల కళ్ళజోడు మూలాని. అత నేదో అనేసరికి ఆ అమ్మాయి సన్నగా నవ్వింది. కుడిచేతివేపున్న చిన్న మేడవేపు ఆ అమ్మాయి పరీక్షగా చూసింది. ఇంటిముందు పూలు నచ్చాయి ఆమెకి. ఏదో అంటుంది ఆ పూలని చూసి. అతను తలూపాడు.

ఆ ఇల్లు బెంగాలీలది. ఒక ముసలాయన, ఆయన రెండో పెళ్ళి భార్య, ఆవిడ సవితికూతురు ఇరవై ఏళ్ళ పిల్ల, వుంటారు ఆ యింట్లో. తొమ్మిదింబావుకి ఆ అమ్మాయి మేడమీద వరండాలో కూర్చుని పేపరు తిరగేస్తుంటుంది. వీళ్ళని చూడగానే ఒక కేక వేస్తుంది కీచుకంఠంతో. ఆ సవితితల్లి పరుగెత్తుకొస్తుంది. ముందుముందుకు వంగి వాళ్ళిద్దరివంకా చూస్తారు. ఏదో అనుకుంటారు-నవ్వుకుంటారు.

యువతీ, యువకుడూ నడుస్తుంటారు. ఒక సైకిలుషాపు. ఈమాటు అతను చూస్తాడు తలతిప్పి. తొమ్మిది ఇరవైకి ఆ సైకిలుషాపు కుర్రాడు సైకిళ్ళు 'ఆయిల్' చేస్తుంటాడు. ఆ అమ్మాయి వంక పరీక్షగా చూస్తూ, ఒక సైకిలునే రెండుసార్లు ఆయిల్ చేస్తాడు పొరబాటున. కళ్ళతోనే తినేసే లాగా చూస్తాడు ఆ యజమాని. వీళ్లు కొంత దూరం పోగానే, కుర్రాడూ, యజమానీ ఒకళ్ళ నొకళ్ళు చూసుకుని భావస్ఫోరకంగా నవ్వుకుంటారు.

ఆ ప్రక్కనే హోటలు గోలగా రేడియో అరుస్తుంటుంది. ప్రొప్రైటరు తన గడియారం 'కీ' యిచ్చే వేళ అది. ఈ జంటని చూడగానే చటుక్కున వాచీతీసి 'కీ' యిస్తాడు. రేడియో ఒక మాటు అటూ ఇటూ తిప్పి, ఆ అబ్బాయిని, అమ్మాయినికలిపి ఒక్కమాటే చూసేస్తాడు.

వాళ్లు నారాయణగూడ జంక్షన్‌దాటి బస్ స్టాపు దగ్గరకి వెడతారు. తొమ్మిది ఇరవైఐదుకి బస్ వస్తుంది. ఆ అమ్మాయి బస్ ఎక్కుతుంది. అతను చిరునవ్వుతో చెయ్యి వూపుతాడు. బస్ వెళ్ళిపోతుంది.

రాత్రి ఏడూ యాభైఐదు.

నారాయణగూడా సినిమా హాలుదగ్గర బస్సు ఆగుతుంది. అమ్మాయి, అబ్బాయి బస్‌దిగి నారాయణగూడ జంక్షన్ దాటి, హిమాయత్ నగరు రోడ్డుమీద నడుస్తుంటారు. మళ్ళా హోటలు ఆకుపచ్చలైట్లు. అద్దాల బీరువాలు ఫలహారాలు. ఆ హోటలు ప్రొప్రైటరు తన స్నేహితుడికి స్పెషలు కాఫీ యిప్పించి బాతాఖానీ వేస్తున్నాడు. స్నేహితుడు ఠక్కున మాటలాపేసి వీళ్ళవంక చూశాడు. ఆ అమ్మాయి పక్కన షాపులోంచి పడే నీలం దీపాల వెలుతురులో మెరుస్తోంది. "స్ట్రైకింగు బ్యూటీ!" అన్నాడు స్నేహితుడు. హోటలు యజమాని తలతిప్పి చూసి గుర్తించాడు వీళ్ళని.

"రోజూ ఇదే వేళకి—సరిగ్గా ఎనిమిదింటికి పెడ తారీవేపు. ఆ అమ్మాయిని చాలా రోజులుగా

చూస్తున్నాను. మరి యితనెవరో?" స్నేహితుడు కుతూహలంతో ముందుకువంగి మెల్లిగా అడిగాడు.

"ఐతే పెళ్ళికాలేదంటావా?"

"ఏమో మరి. ఆ అమ్మాయి ఎక్కడో పని చేస్తున్నట్లుంది. ఈమధ్యే ననుకుంటా వీళ్ళ పరిచయం. కానీ—మహా ఉల్లాసంగా వుంటారోయి ఎప్పుడుచూసినా." సిగరెట్టు వెలిగించిన స్నేహితుడు ఒక దమ్ములాగి, గాలిలో ఉంగరాలుగా పోయే పొగవంక చూశాడు.

"చూడు, పెళ్ళయినా కాకపోయినా ప్రేమలో మునిగివున్నవాళ్లు అల్లాగే వుంటారోయి నిత్యానంద జీవులల్లే! లోకమే దివ్యంగా కనుపిస్తుంది వాళ్ళ కళ్ళకి! అదృష్టవంతులు!" ఒక నిట్టూర్పు విడిచాడు ఆ భావుకుడు.

యువతి, యువకుడు సైకిలుషాపు సమీపించారు...

పెట్రోమాక్సు లైటు వెలుతురులో న్యూసు పేపరు చూస్తున్నాను యజమాని. ఎవడో కుర్రాడు సైకిలు తీసుకొచ్చి పెట్టాడు షాపులో.

"మూడు గంటలు!" అన్నాడు యజమాని రోడ్డువైపు చూస్తూ.

"ఎక్కడా? 7-45 ఐందిప్పుడు. ఐదింటికి తీసుకెళ్ళాను. "యజమాని గడియారం వంకైనా చూడకండా, "ఎనిమిది ఇప్పుడు. నీ గడియారం స్లో" అన్నాడు. ఆ కుర్రాడు డబ్బిచ్చేసి వెళ్ళిపోయాడు మిా మాంపపడకుండా. అతను వెళ్ళగానే షాపులోని పనివాణ్ణి చూసి నవ్వాడు యజమాని.

"టైముకరెక్టాండీ!" అన్నాడు పనివాడుకూడా నవ్వుతూ.

"ఔనోయ్. అదుగో చూడు జంట! గడియారాలు తప్పినా వాళ్లు తప్పరు."

కుర్రాడు ఇదివరకే చూశాడు, "ఔనుగానండి, ఎవరంటారు వీళ్లు? ఆ అమ్మాయి మాత్రమండీ..."

"మరే, బహు నాజూగ్గా వుంటుంది. ఈమధ్యే పెళ్ళయింది కాబోలు. రోజూ బస్సు ఎక్కించాలి, దింపాలి! ఇట్లా వున్నాయి రోజులు!"

కుర్రాడు ముసిముసి నవ్వులు నవ్వాడు. "ఔనండి. అలాగే అనిపిస్తుంది. ఇంకా చూశారో లేదో, ఎప్పుడూ నవ్వేనండి ఆవిడముఖాన." యజమాని తన వుంగరాలు సవరించుకున్నాడు.

"ఊ" అని ఒకసారి మూలిగి పేపరులో పడ్డాడు.

అమ్మాయి, అబ్బాయి ముందుకు సాగారు... మేడ, తోట—పైన బాల్కనీలో లైటు వెలుగుతోంది. ముసలాయన, రెండోపెళ్ళి భార్యా కుర్చీల్లో కూర్చుని వున్నారు. ఆవిడ దూరాన్నుంచే వీళ్ళని గుర్తుపట్టి కుర్చీలోంచి లేచింది.

"అదుగో చూడండి" అన్నది ముసలాయనతో. ఆయనకూడా లేచి నుంచున్నాడు. ఆ అబ్బాయి పూలదండ అందించాడు. ఆ అమ్మాయి అటూ యిటూ చూసి తల్లో తురుముకుంది.

"ఏమిటి చూసేది?" అన్నాడు ముసలాయన చిరాకుగా.

"అదే అన్యోన్యత. రోజూ ఇదేవరస. పొద్దున్నే వెడతారు. ఈపాటివేళ తిరిగొస్తారు. ఎప్పుడూ నవ్వే ఆ పిల్ల ముఖాన. అదృష్టవంతురాలు!" ముసలాయనకి వళ్ళు మండుకొచ్చింది.

"ఇప్పుడు నీకు ఏం తక్కువయిందని? అందర్నీ చూసి కళ్ళల్లో నిప్పులు పోసుకుంటావు. రోజూ చూస్తాను నిన్ను. వాళ్లు రాగానే పెద్ద పనున్న దానల్లే పరుగెత్తుకొచ్చి చూస్తావు. ఒళ్ళు మండుతుంది." ఆయన ధాంధూంలాడుతూ కుర్చీలో కూలబడ్డాడు. ఆవిడ సణుక్కుంటూ లోపలికెళ్ళిపోయింది.

* * *

ఆ అమ్మాయి, అబ్బాయి మసీదుకెదురుగా సందులోకి తిరిగారు. ఒక పెద్ద మేడముందు ఆగారు. ఆ అమ్మాయి తాళం తీసింది. లోపలికి వెళ్ళి లైటు వేసింది. అతను పుస్తకాలు కిటికీలో పడేశాడు.

"ఏమంటావు ఇంతకీ?" అన్నాడతను. ఆ అమ్మాయి చెప్పులు విప్పి గదిలో ఒకమూలకి విసిరింది.

"ఏమంటాను? ఎల్లుండి ప్రొద్దున్నే బయలుదేరి వెళ్ళాలంటాను. ఎన్నిసార్లు చెప్పా నా మాట మీకు?"

"అదికాదు మా—, నామాట విను. ఎందుకొచ్చిన ఖర్చు? పినతల్లి ఆడబడుచుకూతురంటే దగ్గరచుట్టరికం కాదు. ఆవిడ పెళ్ళికి వెళ్ళకపోతే ఇబ్బంది లేదు. ఎందుకు ఇప్పుడు యాభై రూపా

ఖర్చు అంటాను. ఆలోచించు." అతను కాస్త చిరాగ్గానే మాట్లాడుతున్నాడు.

"ఔను. మీకన్నీ అనవసరం ఖర్చులుగానే కనిపిస్తాయి. పెళ్ళిముందు చెప్పిన కబుర్లన్నీ ఏమైనాయో? నన్ను అందలం ఎక్కించేట్లుగా మాట్లాడారు. ఆ అమ్మాయి నా ప్రాణస్నేహితురాలు. నేను వెళ్ళితీరాలి." అతను కుర్చీలోంచి లేచి కిటికీలో పుస్తకం ఒకటి తీసుకున్నాడు.

'సరే నీ యిష్టం. ఇలా ఏకుమేకునై కూర్చుంటావనుకో లేదెప్పుడూ. పెళ్లి ముందు నువ్వు చూపించావు నక్క వినయాలు. నా మాటంటే వేదం అన్నట్లు ప్రవర్తించావు. ఇప్పుడేమో..."

ఆ అమ్మాయి ఉక్రోషం ఆపుకోలేకపోయింది.

"ఔను. పరమ గయ్యాళినైనాను. పోనీలే. చేసుకున్న వారికి చేసుకున్నంత. ఏం చేస్తారు మీ దురదృష్టం. పదండి అన్నం తిందాం" అన్నది ఆ అమ్మాయి వంటింటి తలుపు గొళ్ళెం తీస్తూ. ఆ అబ్బాయి పుస్తకంలో తలదూర్చాడు.

"నా కక్కర్లేదు. నువ్వు తిను."

ఆ అమ్మాయి ఫెడేలున వేసేసింది వంటింటి తలుపు.

"సరే. నాకూ అక్కర్లేదు." దబదబా ఒక తలగడ, దుప్పటి తీసుకొచ్చి మంచం వాల్చింది. "ఇంక శయనించండి" అన్నది. అతను మొహం మాడ్చుకుంటూ మంచంమీద వాలాడు. సిగరెట్టు వెలిగించి కిటికీలోంచి బైటికి చూస్తూ పడుకున్నాడు. ఆమె వంటిల్లు వూడ్చి, అక్కడ ఒక చాపవేసుకుని పడుకుంది. ఆ రాత్రి ఉపవాసం, జాగారం ఆ జంటకి...

తెల్లారి తొమ్మిదింబావు—

మసీదు కెదురుగా సందులోంచి రోడ్డుమీద కొచ్చారు అమ్మాయి, అబ్బాయి. బొంగాలీల మేడ దాటారు. ఆ రెండో పెళ్ళి భార్య, సవితికూతురు బాల్కనీలోకి వచ్చి తొంగిచూశారు. ఆ అమ్మాయికూడా అనుకుంది మనస్సులో, "ఎంత అన్యోన్యతో" అని. దేనివంకా చూడకుండా కంఠాలు తగ్గించి మాట్లాడుకుంటూ నడుస్తున్నారు అబ్బాయి, అమ్మాయి.

సైకిలుషాపు, హోటలు దాటారు. నారాయణగూడా బస్‌స్టాప్ దగ్గర నిల్చున్నారు. తొమ్మిది ఇరవై ఐదుకి బస్సు వచ్చింది. ఆ అమ్మాయి ఎక్కింది. అతను చిరునవ్వుతో చెయ్యివూపాడు. బస్సు కదిలింది. ★

---

(16వ పేజీ తరువాయి)

సింహద్వారం సమీపంలోని అరుగుపై కూర్చొని తీరిగ్గా పేపరు తిరగవేయడం ప్రారంభించాను. కొద్దిదూరంలో మరిద్దరు మాట్లాడుకుంటున్నారు.

"అయితే...మంచి సంబంధం అన్నమాటే!"

"అక్షేపణ లేదు. కాని బాగా వదలిపోయింది."

"ఏమిటది? కట్నం సంగతేనా, ఎంత?"

"ఏభై వేలు రొక్కం, పది ఎకరాలు భూమి."

ఇంతలోకి నా దృష్టి చివరి పేజీలోని శ్రీ అయ్యదేవర వారి విజ్ఞప్తిమీదకు ప్రసరించింది. వరకట్నాలను నిషేధిస్తూ ప్రభుత్వం శాసనం చేయవలెనని యీ పాతకాలపు కాంగ్రెస్‌వాది తాపత్రయం. ఇప్పటికి యెన్ని లేవు యీ నిషేధ చట్టాలు ... మద్యనిషేధం...వ్యభిచార నిరోధం, జూదాల నిషేధం...యింకా యెన్నో. ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణం, నైతిక సూత్రాలపట్ల ప్రజాదరణ లేనిది ఇట్టి చట్టాలవల్ల కలిగే ప్రయోజనం యేమిటి?

గబగబా నడిచి వెడుతున్న ఒక వ్యక్తి నా వద్దకు వచ్చి 'గంట ఎంత అయింది' అన్నాడు. అతణ్ణి గుర్తుపట్టి "మూడు గంటలు. అయితే నీ వ్యవహారం యేమయింది? ఇంకా పరిష్కారం కాలేదా" అని అడిగాను.

లేదన్నాడు ఆ వ్యక్తి.

అతను ఒక రాజకీయ బాధితుడు. సమీపంలోని ఒక గ్రామంలో ప్రభుత్వం అతడికి భూమియిచ్చింది. ఆ గ్రామంలోని ఒక భూస్వామి దౌర్జన్యంగా దానిలో కొంతభాగం ఆక్రమించాడు, రెండేండ్ల క్రిందట. అదేమని అడిగితే దేహశుద్ధి జరుగుతుందనే భయంతో యీ రాజకీయ బాధితుడు ఆ బాధను కూడా దిగమ్రింగి, మంత్రులకు జిల్లా అధికార్లకు పిటీషన్లు పెట్టాడు. బీదవాడు కాబట్టి యిప్పటికీ ఆ విషయం అంతూపొంతూ తేలలేదు.